సాక్షి
విజయనగరం
ఆదివారం । 30 । జూలై । 2023



డీసీసీబీ సేవలను....

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఖాతాదారులకు పిలుపునిచ్చారు. - 8లో



హోరాహోరీగా చెస్ పోటీలు

విజయనగరం జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. - 8లో



మనువాద భావజాలం పోగొట్టాలి

ప్రజల్లోని మనువాద భావజాలం పోగొట్టి, రాజ్యాంగ విధానాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

పాలన బాగుంది



ఎమ్మెల్యే శంబంగి సోదరులను కలిసిన ఆర్.నారాయణమూర్తి

బొబ్బిలి: సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే ప్రభుత్వ సేవలు అందించడం సంతోషదాయకం... పల్లెప్రగతికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని సినీ దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. బొబ్బిలి మండలం పక్కి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ ప్రాంతాల వారు ఒకే చోట ఉండే బొబ్బిలి ప్రాంతమంటే తనకు ఇష్టమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పాగిరిలో స్పెయిన్ బృందం



ఆస్పత్రి వద్ద వివరాలు సేకరిస్తున్న స్పెయిన్ దేశస్తులు

రాజాం: మండలంలోని పాగిరి గ్రామంలోని ప్రభుత్వ లెప్రసీ ఆస్పత్రిని స్పెయిన్ దేశస్తులు శనివారం సందర్శించారు. రోగుల నుంచి వివరాలు సేకరించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం వైద్యులతో చర్చించారు. స్వచ్ఛందంగా సేవలందిస్తున్న సత్యసాయి సేవా సంస్థల రాజాం జోనల్ కన్వీనర్ వి.వి.సత్యనారాయణ, సేవకులు లక్ష్మణమూర్తి, రమేష్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో గైడ్ విజయకృష్ణ పాల్గొన్నారు.

ఆవుదూడపై ఏనుగుల దాడి



ఏనుగులదాడిలో గాయపడిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

రేగిడి: మండలంలోని సరసనాపల్లిలో శుక్రవారం రాత్రి ఏనుగులు హల్‌చల్ చేశాయి. పగలంతా పంటపొలాలు, మామిడితోటలు, నదీ తీరంలో తిష్టవేసిన ఏనుగులు అర్ధరాత్రి సమయంలో గ్రామంలో తిరిగాయి. కడగల స్వామినాయుడుకు చెందిన పశువులపాకలోకి ప్రవేశించి ఆవుదూడను గాయపరిచాయి. పశువుల శాలల్లో భద్రపరిచిన ధాన్యం బస్తాలను చిందరవందరచేశాయి. చెరకు పంటను నాశనం చేశాయి. ఏనుగుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి కవ్వింపు చర్యలు చేపట్టవద్దని అటవీశాఖ బొబ్బిలి డిప్యూటీ రేంజర్ జె.సుధీర్, బీట్ ఆఫీసర్ స్వప్నలు ప్రజలకు సూచించారు. రేగిడి ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, వీఆర్వో రామకృష్ణ, సర్పంచ్ కర్రి అప్పలనాయుడు తదితరులు గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.



సరసనాపల్లి తోటసమీపంలో పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

పేదలపై చంద్రబాబు అక్కసు

- రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్ససత్యనారాయణ
- గొల్లలవలసలో ప్రభుత్వ భవనాలను ప్రారంభించిన మంత్రి
- పేదలకు సేవలందిస్తున్న వలంటీర్లపై విమర్శలు తగవు
- మునుపెన్నడూలేని సంక్షేమపాలన: జెడ్పీచైర్మన్
- గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం జగనన్నతో సాధ్యమైంది: ఎంపీ బెల్లాన



పల్లెల్లో పనిచేస్తున్న సిబ్బంది సాక్షిగా ప్రభుత్వ సంక్షేమ పాలనను గొల్లలవలస సభలో వివరిస్తున్న మంత్రి బొత్ససత్యనారాయణ, పాల్గొన్న ప్రజాప్రతినిధులు

మెరకముడిదాం:

వివిధ సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మెరుగుపరచడాన్ని చూసి ఓర్వలేని చంద్రబాబునాయుడు అక్కసు వెళ్లగక్కుతున్నారని రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెరకముడిదాం మండలం గొల్లలవలస గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాలను జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, ఎంపీ బెల్లానచంద్రశేఖర్‌తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి మధ్యవర్తిత్వం, అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ముఖ్యమంత్రి అందుబాటులోకి తెచ్చారన్నారు. ఈ రెండు వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిస్తే.. అదిచూసి ఓర్వలేని చంద్రబాబు, అండ్ కో ప్రజలను మభ్యపెట్టే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ప్రజలే ఆలోచన చేయాలన్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో పర్యటిస్తే చంద్రబాబుకు అభివృద్ధి అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. సభలో ఉన్న పలువురు వృద్ధులతో మంత్రి బొత్స మాట్లాడారు. పింఛన్లు అందుతున్నాయా.. పింఛన్ డబ్బులు ఇస్తున్నప్పుడు ఎవరైనా లంచం అడుగుతున్నారా అని ప్రశ్నించారు. లేదంటూ వృద్ధులు సమాధానమిచ్చారు. గతంలో పింఛన్ డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారమని, ఇప్పుడు వలంటీర్లు ప్రతి నెలా ఒకటోతేదీన ఇంటికి వచ్చి అందజేస్తున్నారంటూ సంతోషం వ్యక్తంచేశారు. పల్లెప్రజలకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు తదితర సిబ్బంది అందిస్తున్న సేవలను వారి సమక్షంలోనే వివరించారు.

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు మాట్లాడుతూ గొల్లలవలస, సిరిదేవిపురం, యాడిక పంచాయతీలు మండలానికి శివారు గ్రామాలని, ఇక్కడ నుంచి ఎలాంటి అవసరానికైనా కార్యాలయాలకు వెళ్లాలంటే 30 కిలోమీటర్ల దూరంలోని మెరకముడిదాం మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామంలోనే ప్రభుత్వ సేవలందించే సచివాలయం, రైతులకు సాగు సాయం చేసేందుకు వీలుగా రైతుభరోసా కేంద్రం, పేదలకు వైద్యసేవలందించే వైఎస్సార్‌విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయన్నారు. వీటికి లక్షలాది రూపాయల ఖర్చుతో ప్రభుత్వం భవనాలు నిర్మించడం సంతోషదాయకమన్నారు. ప్రజలకు ఊరిలోనే సేవలందిస్తూ.. సంక్షేమ పథకాలను ఇంటికి చేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో గ్రామానికి బి.టి. రోడ్డు నిర్మితమైందన్నారు.
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యంను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారన్నారు. ప్రజలకు పరిపాలనను చేరువ చేసిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, కె.ఎస్.ఆర్.కె. ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, పప్పల కృష్ణమూర్తి, డీఆర్వో గణపతిరావు, ఆర్డీఓ అప్పారావు, డీఎస్పీ చక్రవర్తి, జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ రాజ్‌కుమార్, డీపీఓ శ్రీధర్‌రాజు, సర్పంచ్‌లు గోవింద్, అప్పలనాయడు, మోహన్‌రావు పాల్గొన్నారు.



గొల్లలవలసలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స, పక్కన జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, తదితరులు

ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్ షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.సుధాబిందు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అప్రెంటీస్‌షిప్ ఇండియా.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో ఆగస్టు 15లోగా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. డీజిల్ మెకానిక్, మెటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిల్‌రైట్ మెకానిక్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మన్యం పార్వతీపురంలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుదారులు ఆగస్టు 21న ఉదయం విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజీకి హాజరుకావాలన్నారు. పూర్తివివరాలకు ఫోన్: 08922-294906 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రసవ సేవలు ఉచితం



విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో వైద్యసేవలందుకుంటున్న తల్లీబిడ్డలు

- గర్భిణులకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం
- 2019 నుంచి ఇప్పటి వరకు 42,235 మందికి ప్రసవ సేవలు
- దీనికోసం రూ.51.50 కోట్ల వెచ్చింపు

ప్రసవ సేవలు ఇలా...

సంవత్సరం	ప్రసవాల సంఖ్య	వెచ్చించిన నిధులు
2019-20	9,800	రూ.12.90 కోట్లు
2020-21	10,800	రూ. 12.90 కోట్లు
2021-22	10,735	రూ. 12.60 కోట్లు
2022-23	10,900	రూ. 13.10 కోట్లు

విజయనగరం ఫోర్ట్:

మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. మహిళలు గర్భం దాల్చిన నుంచి ప్రసవించేవరకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులలో సేవలు ఉచితంగా పొందే అవకాశం కల్పించింది. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం కింద 2019 నుంచి ఇప్పటి వరకు 42,235 మంది గర్భిణులు ప్రసవ సేవలు పొందారు. దీనికోసం ప్రభుత్వం రూ.51.50 కోట్లు వెచ్చించింది. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉన్న ఆస్పత్రులు 30 ఉండగా, వీటిలో ప్రైవేటు ఆస్పత్రులు 18, ప్రభుత్వాస్పత్రులు 12 ఉన్నాయి.

మెరుగైన వైద్యం



నాపేరు ఎం.విశాలక్ష్మి. మాది విజయనగరంలోని గాయత్రినగర్. ప్రసవం కోసం ఘోష ఆస్పత్రిలో చేరాను. ఆరోగ్యశ్రీ ద్వారా నాకు సిజేరియన్ చేశారు. అన్ని సేవలు ఉచితంగా అందిస్తున్నారు. భోజనం, వసతులు బాగున్నాయి. తల్లీబిడ్డల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

నచ్చిన ఆస్పత్రిలో..



ఆరోగ్యశ్రీ పథకం అందుబాటులో ఉన్న ఏ ఆస్పత్రిలోనైనా ప్రసవం జరిపించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. గర్భిణులు వారికి నచ్చిన ఆస్పత్రిలో ప్రసవం జరిపించుకుంటున్నారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా సేవలు పొందుతున్నారు.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

పైసా ఖర్చులేకుండా..



నా పేరు బోడసింగి వరలక్ష్మి. మాది గరివిడి మండలంలోని కొండదాడి గ్రామం. ప్రసవం కోసం విజయనగరంలో ఉన్న ఘోష ఆస్పత్రిలో చేరాను. ఆరోగ్యశ్రీ పథకం కింద సిజేరియన్ చేశారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా ప్రసవం జరిపించారు.

175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

- పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో వచ్చేఏడాది జరగనున్న సాధారణ ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ప్రధాన అజెండాగా ప్రతీ కార్యకర్త కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి బొత్స సత్యనారాయణ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యకర్తల కృషితోనే 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించిందన్నారు. కార్యకర్తలందరికీ పార్టీ తగిన గుర్తింపు ఇచ్చినట్టు వెల్లడించారు. పార్వతీపురం బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మన్యం జిల్లాలో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని అన్ని విభాగాల్లో జిల్లా కమిటీలు, నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలో పేదోళ్లకు అందిస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తీరును చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని తిప్పికొట్టే బాధ్యత నాయకులు, ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తుంటే ఎల్లోమీడియా వాటిని వక్రీకరిస్తోందన్నారు. వాటివల్ల పార్టీకి ఒరిగేదేమీ లేదన్నారు. ప్రతీ పల్లెల్లో ఇంటింటికి వెళ్లి ఓటు అడిగే నైతిక హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు. కార్యకర్తలు పార్టీకి వెన్నుదన్నులా ఉన్నారని, కార్యకర్తల్లో గొడవలు పెట్టి తద్వారా లబ్ధిపొందేందుకు టీడీపీ, జనసేనలు ప్రయత్నిస్తున్నాయని, వారికి అలాంటి అవకాశం ఇవ్వొద్దని సూచించారు.



పార్వతీపురంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు, ఎమ్మెల్యేలు అలజంగి జోగారావు, పాముల పుష్పశ్రీవాణి

నిరంతర అధ్యయనంతో చక్కని తీర్పులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

విజయనగరం లీగల్: న్యాయవాదులు నిరంతర అధ్యయనంతోనే చక్కని తీర్పులు ఇవ్వగలరని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో, జిల్లా బార్ అసోసియేషన్ సహకారంతో తోటపాలెం సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వివిధ న్యాయపరమైన అంశాలపై శనివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కొత్త చట్టాలు, కొత్తకొత్త తీర్పులపై న్యాయవాదులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీనియర్ న్యాయవాదులు తమ అనుభవాన్ని, జ్ఞానాన్ని ఇతరులతో పంచుకోవాలని కోరారు. న్యాయవాదులకు అవగాహన కల్పించే లక్ష్యంతో సెమినార్‌ల నిర్వహణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర బార్ కౌన్సిళ్లు చురుకైన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ ప్రతిరోజూ వివిధ కోర్టుల్లో సరికొత్త తీర్పులు వస్తుంటాయని, వాటిపై అధ్యయనం చేయాలన్నారు. జడ్జిలుగా ఎంపికయ్యేవారిలో విజ యనగరం, శ్రీకాకుళం జిల్లాల న్యాయవాదుల సంఖ్య తక్కువగా ఉంటోందన్నారు. ఆంగ్ల భాషా నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు.
- రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ విజయనగరం జిల్లా కళలకు పుట్టినిల్లు అని, న్యాయవాదుల్లో కూడా ఎంతోమంది కళాకారులు ఉన్నారని అన్నారు. న్యాయవాద వృత్తిలో కూడా ఎంతో అనుభవం ఉందని, పేరు ప్రఖ్యాతులు పొందారని చెప్పారు. ఇలాంటి సెమినార్‌ల వల్ల న్యాయవాదుల్లో నేర్చుకోవాలన్న స్ఫూర్తి రగులుతుందని అభిప్రాయపడ్డారు.
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ న్యాయపరమైన అంశాలపై సంపూర్ణ అవగాహన కల్గించేందుకు ఇటువంటి సెమినార్‌లు దోహదపడతాయన్నారు. యువ న్యాయవాదులకు, న్యాయ విద్యార్థులకు ఇవి ఉపయుక్తమని తెలిపారు.
- ప్రజల ప్రాథమిక హక్కుల పరిరక్షణే హైకోర్టు, సుప్రీంకోర్టుల ప్రధాన లక్ష్యమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ యు.దుర్గాప్రసాద్ అన్నారు. ఆయన సివిల్ కోర్టుల పరిధి అనే అంశంపై మాట్లాడుతూ వాజ్యాలు దాఖలు చేసేందుకు కోర్టుల పరిధి చాలా ముఖ్యమన్నారు. చట్టసభల్లో చేసిన చట్టాలను పరిరక్షించడమే కోర్టు బాధ్యతగా పేర్కొన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో ప్రపంచ దేశాలు అనేక విధాలుగా ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగినా అప్పటి ఇంగ్లాండ్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ న్యాయస్థానాలు పని చేస్తున్నాయి కదా అంటూ వ్యాఖ్యానించడాన్ని ఆయన గుర్తుచేశారు.
- జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేరం రుజువయ్యేంత వరకు నేరం ఆరోపించిన వ్యక్తిని నిర్దోషిగానే పరిగణించాలన్నారు. క్రిమినల్ కేసుల్లో విచారణ జాప్యం కారణంగా అనేక మంది నిందితులు జైలులో మగ్గిపోతున్నారని, ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా తీర్పులో దిగువస్థాయి కోర్టుల న్యాయమూర్తులకు పలు సూచనలు చేసిందన్నారు. వాటిని ఆచరణలోకి తేవాలన్నారు. జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ క్రిమినల్, ప్రొసీజర్ కోడ్ చట్టంలోని పలు అంశాలను కూలంకుషంగా వివరించారు. జస్టిస్ రాయ్ పలు ప్రశ్నలు అడిగి వాటిని న్యాయవాదుల నుంచి జవాబులను రాబట్టారు. జిల్లా బార్ అసోసియేషన్‌కు విరాళాలు అందజేసిన న్యాయవాదులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.రామజోగేశ్వరరావు, బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎ.రామిరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ వైస్ చైర్మన్ కె.వి.ఎస్ తమ్మన్నశెట్టి, న్యాయవాదుల సంఘప్రతినిధులు చొక్కాపు దామోదర్, వీజీ. సంతోష్, ఎ.అంజనీకుమార్, కె.చినప్పారావునాయు డు, బి.రాంబాబు, ఎస్.సుబ్రహ్మణ్యంతో పాటు ప్రభుత్వ న్యాయవాది టి.వి.శ్రీనివాసరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బెల్లాన రవి, కె.ఫల్గుణరావు, ఎం.శంకరరావు, నాయవాదులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న జస్టిస్ ఆకుల శేషసాయి



హాజరైన న్యాయమూర్తులు, న్యాయవాదులు

క్లుప్తంగా

నూతన విద్యావిధానంపై పీఎం మోదీ సందేశం



ప్రధాని మోదీ సందేశాన్ని వింటున్న సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు

నెల్లిమర్ల రూరల్: నూతన జాతీయ విద్యావిధానంపై ప్రధానమంత్రి(పీఎం) నరేంద్ర మోదీ తన సందేశం వినిపించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని మండలంలోని టెక్కలి సంచూరియన్ వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు ఎల్ఈడీ స్క్రీన్‌పై వీక్షించారు. న్యూఢిల్లీలోని ప్రగతి మైదానం వేదికగా ప్రధాని మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులను స్వీకరించాలన్నారు. ప్రతీ విద్యార్థి బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్‌లు ప్రొఫెసర్ సన్నీ డియోల్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న టిడ్కో ఇళ్లు



టిడ్కో ఇళ్ల సముదాయాల్లోని కొన్ని బ్లాకులివే..

బొబ్బిలి: పట్టణంలోని పేదలందరికీ ఇళ్లు ఇచ్చేందుకు మూడు విభాగాల్లోని టిడ్కో ఇళ్లు సిద్ధమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని రామందొరవలసలో 1680 ఫ్లాట్లు పేద, మధ్య తరగతి ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం చివరి దశ పనులు జోరుగా జరుగుతున్నాయి. మొత్తం 35 బ్లాకుల్లో 1680 ఇళ్లు సిద్ధమవుతున్నాయి. లబ్ధిదారులకు డిసెంబర్‌లో ఇళ్లు అందజేస్తామని డీఈఈ ఎం. బాలకృష్ణ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

అభాగ్యులపై 'వాత్సల్యం'

- అనాథ బాలలకు అండగా మిషన్ వాత్సల్య పథకం
- అర్హులకు ప్రతినెలా రూ.4 వేల ఆర్థికసాయం
- తల్లిదండ్రులిద్దరు గానీ, తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు గానీ లేనివారు అర్హులు
- జిల్లా వ్యాప్తంగా కొత్తగా 14 వేల మంది దరఖాస్తు
- జిల్లాలో ప్రస్తుతం లబ్ధి పొందుతున్న వారు 314 మంది



విజయనగరం ఫోర్ట్: మిషన్ వాత్సల్య పథకం అభాగ్యులకు అండగా నిలుస్తోంది. నిస్సహాయ స్థితిలో ఉన్న వారికి ఆర్థిక చేయూతనందిస్తూ కొండంత భరోసానిస్తోంది. ఇప్పటికే ఈ పథకం ద్వారా వందలాది మంది లబ్ధి పొందుతున్నారు. ఇంకా అర్హులైన వారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. ఈ మేరకు ఇటీవల అధికారులు ఓ ప్రకటన విడుదల చేయడంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పాన్సర్‌షిప్ అందిస్తున్నాయి. పేదరికం, నిరాదరణ కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే సదుద్దేశ్యంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు(తల్లి లేక తండ్రిని కోల్పోయినవారు), పేదరికంతో ఇంటిపెద్దను కోల్పోయిన వారు, హెచ్ఐవీ పీడిత బాలలు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకానికి అర్హులైన వారికి నెలకు రూ.4 వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తారు. ఇది పిల్లల చదువుకు, వారిని ఆదరించిన వారికి వారు భారం కాకూడదనేది ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం.

వార్షిక ఆదాయం రూ.72 వేలకు..

గ్రామీణ ప్రాంతాల్లో అయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో అయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.96 వేలు మించని వారు ఈ పథకానికి అర్హులు. కాల పరిమితి జేజే బోర్డు, బాలల సంక్షేమ కమిటీ కోర్టు లిఖిత పూర్వకంగా ఇచ్చిన కారణాల ఆధారంగా అవసరాన్ని బట్టి, స్పాన్సర్‌షిప్ పొడిగించవచ్చు. ఏ సమయంలోనైనా స్పాన్సర్‌షిప్ అందుకుంటున్న బాలలు ఏదైనా వసతిగృహం, బాల సదనంలో చేరితే వారు చేరిన తర్వాత నుంచి ఈ ఆర్థిక సహాయం నిలిపివేస్తారు. ప్రత్యేకావసరాలు కలిగిన బాలల విషయంలో మినహా పాఠశాలలకు వెళ్లే వారు పాఠశాల హాజరు సక్రమంగా లేదని తేలినా పథకం నుంచి వారిని తాత్కాలికంగా నిలిపివేస్తారు.

314 మందికి లబ్ధి..

జిల్లాలో 314 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇటీవల పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటన ఇవ్వడంతో 14 వేల వరకు దరఖాస్తు వచ్చాయి. ఈ దరఖాస్తులను అధికారులు పరిశీలించి, దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అర్హులకు ప్రతినెలా రూ.4 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందించనుంది.

నా కొడుకును చదివించుకోగలుగుతున్నా..



మిషన్ వాత్సల్య పథకం ద్వారా వస్తున్న డబ్బులతో నా కొడుకును చదివించుకోగలుతున్నాను. నా భర్త చనిపోయిన తర్వాత పథకం కోసం దరఖాస్తు చేసుకున్నాము. పథకం మంజూరైంది. కొన్నిరోజుల క్రితమే 7 నెలలకు సంబంధించి, మొత్తం 28 వేలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఎస్.శారద, విజయనగరం.

రూ.56 వేలు జమ అయ్యాయి..



నా భర్త మరణంతో ఇద్దరు పిల్లలతో కుంగిపోయిన నాకు మిషన్ వాత్సల్యం పథకం ఆదుకుంది. పథకం కోసం ఇద్దరు పిల్లల తరఫున దరఖాస్తు చేసుకున్నాం. ఇద్దరికీ మంజూరైంది. ఇటీవల 7 నెలలకు సంబంధించి, ఇద్దరి పిల్లలకు కలిపి మొత్తం రూ.56 వేలు మా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. భర్త మృతితో జీవనాధారం కోల్పోయిన తమకు ఈ డబ్బులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. –లక్ష్మి, విజయనగరం.

పథకంపై అవగాహన కల్పిస్తున్నాం..

పథకంపై అవగాహన కల్పించడంతో పాటు దరఖాస్తుల స్వీకరణకు కూడా ప్రకటన ఇచ్చాం. కొత్తగా జిల్లా నుంచి వేలాది దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి, ప్రభుత్వానికి పంపించాం.

–బి.శాంతకుమారి, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



నందిగాంలో పెట్రోలుబంకు ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: డీసీసీబీ(జిల్లా కేంద్ర సహకార బ్యాంకు) సేవలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. మండలంలోని నందిగాం గ్రామంలో డీసీసీబీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగేళ్లలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, సొసైటీల బలోపేతానికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలోని కమర్షియల్ బ్యాంకులకు దీటుగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు ఎంతగానో సేవలందిస్తుందన్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను పీఏసీఎస్‌ల ద్వారా సబ్సిడీపై అందిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల బలోపేతానికి కూడా డీసీసీబీ కృషి చేస్తోందన్నారు. డీసీసీబీలో డిపాజిట్లు చేసేందుకు ముందుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు ఖాతాలు ఇకనుంచి డీసీసీబీల్లో ప్రారంభించేలా మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులంతా కృషి చేయాలన్నారు. తోటపల్లి ప్రాజెక్టు నుంచి నందిగాం పరిసర గ్రామాల రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బొబ్బిలి రాజుల మాటలు నమ్మరు..

బొబ్బిలిలో బొబ్బిలి రాజుల మాటలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గం ప్రజలు 15 ఏళ్లపాటు వారికి అధికారమిస్తే వారు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. మూడు దఫాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సుజయ్‌కృష్ణ రంగారావు నియోజకవర్గానికి ఏమీ చేయలేదు కాబట్టే ప్రజలకు ముఖం చాటేశారన్నారు. వారు చేసిన అభివృద్ధి, తాము చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వి.చినరామినాయుడు, సీఈఓ జనార్దన్, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, తెర్లాం, బొబ్బిలి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు ఎన్.బాబ్జీరావు, ఎస్.వేణుగోపాలనాయుడు, నందిగాం పీఏసీఎస్ అధ్యక్షుడు మృత్యుంజయరావు, డీసీసీబీ పాలకవర్గ సభ్యుడు బి.అప్పలనాయుడు, నందిగాం సర్పంచ్ గంగ, ఎంపీటీసీ గౌరి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోని మనువాద భావజాలం పోగొట్టాలి

- భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు



మాట్లాడుతున్న భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కరరావు

విజయనగరం పూల్‌బాగ్: ప్రజల్లోని మనువాద భావజాలం పోగొట్టి, రాజ్యాంగ విధానాలు పూర్తిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సి.భాస్కరరావు కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన భారత్ బచావో జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజలు చైతన్యంతో కుల, మతాలకు అతీతంగా నేను భారతీయుడుననే భావనతో మెలగాలన్నారు. మన భారతీయుల్లో మనువాద భావాలు పాతుకపోయాయని, ఈ భావజాలాన్ని పక్కనబెట్టి, రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అండగా నిలవడం తప్ప సామాన్య ప్రజానీకానికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ వల్లే రూ.13 వేల కోట్ల ఆస్తి ఉన్న అదాని ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానానికి చేరుకున్నాడని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కూడా ప్రైవేటుపరం చేసేందుకే మోదీ సర్కారు మొగ్గు చూపుతోందే తప్ప ఒక్క ప్రభుత్వ రంగ సంస్థనైనా నెలకొల్పారా అని నిలదీశారు. ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, వీహెచ్‌పీ సంస్థల కనుసన్నల్లోనే మోదీ పాలన జరుగుతోందని, రెండు దఫాలు అధికారంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజాసంక్షేమంపై దృష్టిసారించింది లేదన్నారు. నిత్యం ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న మోదీని వచ్చే ఎన్నికల్లో ఓడించడం కంటే ముందు ప్రజల్లో నెలకొన్న మనువాద భావాలు రూపుమాపాలన్నారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా కన్వీనర్ ఎ.కరీం, ప్రజాసంఘాల ప్రతినిధులు పి.షణ్ముఖరావు, జి.సీతామహాలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

రామతీర్థంలో బీజేపీ మహిళా మోర్చా నేతలు



స్వామి సన్నిధిలో బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు లలితకుమారి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: పురాతన దేవాలయాల సందర్శనలో భాగంగా రామతీర్థం సీతారామస్వామి దేవస్థానాన్ని బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు లలితకుమారి శనివారం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో మాట్లాడి రామతీర్థం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. బోడికొండపై బస్సు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చా ప్రతినిధులు శాంతి, భువనేశ్వరి, పద్మ, దేవి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు హాజరైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతిలో ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో వారు పాల్గొంటారు. అండర్-19 బాల, బాలికల విభాగాల్లో జరిగే ఈ పోటీలకు జిల్లా స్థాయిలో ఎంపికలు నిర్వహించి, ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారినే పోటీలకు పంపించామని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్ శనివారం తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న వారిలో కె.పవన్, కె.ముఖేష్‌కుమార్, ఎ.భరద్వాజ్, బి.సూర్యకిరణ్, వి.పవన్‌కుమార్, వి.జాహ్నవి, కె.ప్రజ్ఞానాయుడు, బి.హారిక, పి.మౌనిక, జె.శ్రియదేవి ఉన్నారన్నారు. జిల్లా జట్టుకు కోచ్ అండ్ మేనేజర్లుగా ఎస్.శ్రీనివాసరావు, జె.విజయరామరాజు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

హోరాహోరీగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో నిమగ్నమైన క్రీడాకారులు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీమ్ ఫిడే రేటింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలకు విశాఖపట్నం, కృష్ణా జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరై, ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ఇంటర్నేషనల్ ఆర్బిటర్ జి.వి.కుమార్ వ్యవహరిస్తున్నారు.

వేర్వేరు దుర్ఘటనల్లో ఏడుగురు మృత్యువాత

వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు దుర్ఘటనల్లో పలువురు మృత్యువాత చెందారు. దీంతో బాధిత గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

గజపతినగరంలో గ్యాంగ్‌మన్..



భాస్కరరావు(ఫైల్)

గజపతినగరం: రైలు దిగుతుండగా గ్యాంగ్‌మన్ పరపతి భాస్కరరావు(38) మృతి చెందారు. ఈ విషాద ఘటన గజపతినగరం రైల్వేస్టేషన్‌లో శనివారం జరిగింది. విశాఖపట్నంలోని అల్లిపురంలో నివాసముంటున్న ఆయన ఎప్పటిలాగే విధుల నిమిత్తం ప్యాసింజర్ రైలులో విశాఖపట్నం నుంచి గజపతినగరానికి బయలుదేరారు. రైల్వేస్టేషన్‌కు రాగానే ఆగుతున్న రైలు దిగుతూ కాలుజారి కింద పడిపోయారు. దీంతో తీవ్రగాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే పోలీస్ కృష్ణ తెలిపారు. మృతునికి భార్య మేరి, కొడుకు జైషిత్, కుమార్తె హాసిని ఉన్నారు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు.

పురుగుమందు తాగి..



దొంక అరవింద్ (మృతుడు)

గజపతినగరం రూరల్: పురుగుమందు తాగడంతో తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దొంక అరవింద్(35) శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని భూదేవిపేట గ్రామానికి చెందిన అరవింద్, లక్ష్మి భార్యభర్తలు. సరిగ్గా ఐదు రోజుల క్రితం భర్త మద్యం తాగి ఇంటికి వచ్చాడని, ఆయనను భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పురుగుమందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది చూసిన భార్య కూడా అదే పురుగుమందు తాగింది. అస్వస్థతకు గురైన భార్యాభర్తలిద్దరినీ చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ తెల్లవారుజామున అరవింద్ చనిపోయాడన్నారు. ఆయన భార్య ఆరోగ్యం నిలకడగా ఉందని, బాధిత బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతూ..



కొత్తవలస: మృతి చెందిన వెంకటరమణ

కొత్తవలస: తాటిపండు నెత్తినపడి, తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిల్లాన వెంకటరమణ(63) అనే వ్యక్తి శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ బి.దేవి వెల్లడించారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన వెంకటరమణ శుక్రవారం ఉదయం తన పొలంలో దమ్ము పనుల కోసమని దగ్గరలోని ట్రాక్టర్ డ్రైవర్‌ను పిలిచేందుకు వెళ్లాడు. అతడు వెళ్లే దారిలోని తాటిచెట్టు పైనుంచి నేరుగా అతడి తలపై ఓ తాటిపండు పడింది. దీంతో అతడు తీవ్రగాయాలపాలై, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతుండగా ఉదయం చనిపోయారని, మృతుడి కొడుకు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పశువులు కాసేందుకు వెళ్లి..



సాలూరు: జ్యోతిప్రకాష్(ఫైల్)

సాలూరు: పశువులను మేతకు తీసుకువెళ్లిన ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని కూర్మరాజుపేట గ్రామంలో కలకలం రేపింది. రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కూర్మరాజుపేటకు చెందిన బైరెడ్డి జ్యోతిప్రకాష్ శుక్రవారం తమ పశువులను సమీపంలోని చిన్నవలస కొండల వైపు మేతకు తీసుకుని వెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. రైతులు కొంతమంది మీ పశువులు తమ పొలాల్లోని నారుమడులను పాడు చేస్తున్నాయని జ్యోతిప్రకాష్ తండ్రి శ్రీనివాసరావుకు తెలిపారు. దీంతో ఆయన ఆశ్చర్యపోయి, కొడుకు ఉండగా, పశువులు వేరే దగ్గర తిరగడమేంటని పొలాల్లో కొడుకు ఆచూకీ కోసం గాలించారు. అయినా ఫలితం లేదు. శనివారం ఉదయం కొంతమంది యువకులు చిన్నవలస కొండల వైపు వెళ్తుండగా, అక్కడ నీటితో నిండిన ఓ క్వారీ గుమ్మిలో జ్యోతిప్రకాష్ మృతదేహం చూసి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న వారు కొడుకు మృతదేహం చూసి, కన్నీరుమున్నీరయ్యారు. కొడుకు మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్న సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి విచారణ చేపట్టడం గమనార్హం.

చిట్టిగెడ్డలో విద్యార్థి మృతదేహం..



నెల్లిమర్ల రూరల్: కొడుకు మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లిదండ్రులు

నెల్లిమర్ల రూరల్: శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలం, దేవునిపాలవలస గ్రామంలో ఉన్న చిట్టిగెడ్డలో గల్లంతైన విద్యార్థి మృతదేహం శనివారం లభ్యమైంది. నెల్లిమర్ల మండలంలోని పినతరిమి గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దేబార్కి లోకేష్(14) శుక్రవారం స్నేహితులతో కలిసి సరదాగా ఈతకోసం సమీపంలోని చిట్టిగెడ్డకు వెళ్లాడు. గెడ్డలో దిగిన లోకేష్ నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు, గ్రామస్తులు ముమ్మరంగా గాలించినప్పటికీ అతడి ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం వేకువజామున 5 గంటల ప్రాంతంలో చిట్టిగెడ్డలో లోకేష్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు గెడ్డలో దిగి, మృతదేహాన్ని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. కొడుకు మృతదేహాన్ని చూసి, తల్లిదండ్రులు మహేష్, రాజేశ్వరి బోరున విలపించారు. శ్రీకాకుళం కేంద్రాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తయిన తర్వాత స్వగ్రామానికి మృతదేహం తరలించారు.

కారు ఢీకొని..



పాలకొండ రూరల్: ఘటన స్థలంలో మృతుడు గోవిందరావు

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదపాక గోవిందరావు(47) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం జిల్లా, సరుబుజ్జిలి మండలం, రావివలసకు చెందిన అదపాక గోవిందరావు(47) తన కొడుకు కృష్ణవర్ధన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వీరఘట్టంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఓ కారు అట్టలి గ్రామ సమీపంలో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో గోవిందరావు తీవ్రగాయాలపాలై, సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఆయన కొడుకుకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి మృతదేహం తరలించి, కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశామని ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య ఈశ్వరమ్మ, ఓ కొడుకు, కూతురు ఉన్నారు.

బహిర్భూమికి వెళ్తుండగా..



సింహాచలం(ఫైల్)

బొబ్బిలి: మండలంలోని కలువరాయి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాము సింహాచలం(45) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. అతడు బహిర్భూమికి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని, మృతి చెందినట్లు ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.